
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా
జిల్లా వార్తలు

గురువారం 6 జూన్ 2024

విధ్వంస పాలనకు ఓటర్లు 'రికార్డు' స్థాయిలో ముగింపు పలికారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అత్యధిక నియోజకవర్గాల్లో మెజారిటీల మోత మోగించారు. నియోజకవర్గాల ఆవిర్భావ చరిత్రలోనే లేని సంచలన విజయాలు అందించారు. ఇటువంటివాటిలో గుడివాడ ముందు వరుసలో ఉంది. గన్నవరంలోనూ ఎన్నడూలేని ఆధిక్యత యార్లగడ్డకు దక్కింది. పెనమలూరు, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ ఇలా ఒకటేమిటి 14 నియోజవకర్గాల్లోనూ ఓటర్లు కసిదీరా తమ ఓట్లతో కూటమి అభ్యర్థులను గెలిపించి ఫ్యాన్ రెక్కలు విరిచారు. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



ఓట్ల సునామీ!





రికార్డు స్థాయిలో కూటమి అభ్యర్థుల మెజార్టీలు

- అత్యధిక నియోజకవర్గాల్లో పాత రికార్డులు బద్దలు
- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో విజయవాడ సెంట్రల్ టాప్
- 68,886 ఓట్ల ఆధిక్యంతో రాష్ట్రంలో 11వ స్థానంలో బొండా ఉమ

ఎన్టీఆర్ జిల్లాలో 57.90 శాతం..

కృష్ణాలో 60.41 శాతం ఓటర్లు కూటమి వైపే



రికార్డు గెలుపులివిగో..

- 1982, 1985ల్లో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు సైతం రాని మెజారిటీ గుడివాడలో ఈసారి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు వచ్చింది. రాముకు వచ్చిన 53,040 మెజారిటీ నియోజకవర్గ ఆవిర్భావం తర్వాత అత్యధిక మెజారిటీగా రికార్డులకెక్కింది.
- గన్నవరంలో సైతం అదే ట్రెండ్ కొనసాగింది. 1955లో నియోజకవర్గ అవిర్భావం తర్వాత యార్లగడ్డ వెంకట్రావుదే అత్యధిక మెజారిటీ. ఇక్కడ పుచ్చలపల్లి సుందరయ్య లాంటి హేమాహేమీలు సైతం ఈ రికార్డును సాధించలేకపోయారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థికి అత్యధికంగా 21,202 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆ తర్వాత ఏ అభ్యర్థికి 20వేలు మెజారిటీ దాటింది లేదు. గత రెండు ఎన్నికలను పరిశీలిస్తే 2014లో శ్రీరాం తాతయ్యకు 1846 ఓట్ల మెజారిటీ రాగా 2019లో సామినేని ఉదయభానుకు 4778 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఈసారి టీడీపీ అభ్యర్థి తాతయ్యకు 15977 ఓట్ల ఆధిక్యం లభించింది.
- నందిగామ నియోజకవర్గ చరిత్రలో 1999లో దేవినేని ఉమా అత్యధికంగా 23,511 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2014లో అప్పటి సిటింగ్ ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకర్‌రావు మృతితో 2014లో ఉప ఎన్నిక జరగ్గా ఆ ఎన్నికల్లో ఆయన కుమార్తె తంగిరాల సౌమ్యకు సానుభూతి వెల్లువెత్తడంతో అత్యధికంగా 74,827 ఓట్లు మెజారిటీ లభించింది. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ మెజారిటీ 12వేలకు మించలేదు. ఈసారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సౌమ్య 27,395 ఓట్ల మెజార్టీతో రికార్డు సృష్టించారు.
- తిరువూరు నియోజకవర్గ ఆవిర్భావం తర్వాత 2004లో కోనేరు రంగారావుకు అత్యధికంగా 16,700 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఆ రికార్డును టీడీపీ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు 21,874 ఓట్లతో చెరిపివేశారు.
- మైలవరం నియోజకవర్గంలో 1972లో చనుమోలు వెంకట్రావుకు అత్యధికంగా 23,023 మెజారిటీ వచ్చింది. ఈ ఎన్నికల్లో 42,829 ఓట్ల మెజార్టీతో ఆ రికార్డును టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ చెరిపివేశారు.
- విజయవాడ తూర్పు 1967లో ఆవిర్భవించింది. 2004లో వంగవీటి రాధాకృష్ణ అత్యధికంగా 26,711 మెజారిటీ సాధించారు. ఈసారి గద్దె రామ్మోహన్ 49,640 ఓట్ల ఆధిక్యంతో దాన్ని తిరగరాశారు.
- విజయవాడ పశ్చిమ 1967లో ఆవిర్భవించగా 2004లో షేక్ నాసర్‌వలీ (సీపీఐ)కి 26,519 ఓట్ల ఆధిక్యం లభించింది. ఇప్పటి వరకు అదే రికార్డుగా ఉంది. దాన్ని కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా నిలిచిన సుజనా చౌదరి 47,032 ఓట్ల ఆధిక్యంతో చెరిపివేశారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ ఒకే ఒక్కసారి గెలిచింది. అలాంటి నియోజకవర్గంలో టీడీపీతో జతకట్టి బీజేపీ అభ్యర్థి అనూహ్య విజయాన్ని సాధించారు.
- విజయవాడ సెంట్రల్‌లో 2009లో ఆవిర్భవించింది. 2014 బొండా ఉమామహేశ్వరావు 27,161 ఓట్ల ఆధిక్యం సాధించగా అదే అత్యధికంగా ఉంది. దాన్ని ఆయనే ఈ ఎన్నికల్లో తిరగరాశారు. 68,886 ఓట్లు సాధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలో రికార్డు నెలకొల్పారు. రాష్ట్రస్థాయిలో మెజారిటీల పరంగా 11వ స్థానంలో నిలిచారు.
- మచిలీపట్నం 1955లో ఆవిర్భవించింది. 2004లో పేర్ని నాని 31,301 ఓట్ల ఆధిక్యంతో గెలవగా అదే నియోజకవర్గ రికార్డుగా ఉంది. దాన్ని టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర 50,242 ఓట్ల ఆధిక్యంతో తిరగరాశారు.
- అవనిగడ్డ నియోజకవర్గ చరిత్రలో గత ఎన్నికల్లో సింహాద్రి రమేశ్‌కు లభించిన 20,725 ఓట్ల ఆధిక్యమే రికార్డుగా ఉంది. దాన్ని సీనియర్ నాయకుడు, జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ తిరగరాశారు. 46,434 ఓట్ల ఆధిక్యంతో అందరినీ ఆశ్చర్యపరిచారు.
- పామర్రు నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం తర్వాత రెండే రెండుసార్లు గెలిచింది. 1983, 1999లో తప్ప టీడీపీకి ఆ నియోజకవర్గం కొరకరాని కొయ్యగా ఉంది. అలాంటి నియోజకవర్గంలో ఈసారి టీడీపీ 29,690 ఓట్ల ఆధిక్యంతో గెలుపు జెండా ఎగురవేసింది.
- పెనమలూరు నియోజకవర్గ చరిత్రలో ఈసారి బోడె ప్రసాద్‌కు లభించిన 59,915 ఓట్ల మెజారిటీయే రికార్డు.

ఐదేళ్ల పాలనతో విసిగిపోయి..

వైసీపీ ఐదేళ్ల పాలనతో రెండు జిల్లాల ప్రజలు విసిగెత్తిపోయారు. మంత్రులుగా చేసిన కొడాలి నాని, పేర్ని నాని, వెలంపల్లి శ్రీనివాసరావు, జోగి రమేశ్ వంటి వారు అభివృద్ధిని గాలికొదిలేసి.. ప్రతిపక్షనేతలను తిట్టే పనిలోనే నిమగ్నమవ్వడం ఓటర్లకు రుచించలేదు. అభివృద్ధి సంగతి దేవుడెరుగు ఎక్కడికక్కడ దోపిడీ, విధ్వంసాలు.. కక్షసాధింపు రాజకీయాలతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. గన్నవరం ఎమ్మెల్యే వంశీ, మంత్రిగా ఉన్న జోగి రమేశ్, మాజీ మంత్రులు కొడాలి నాని, ఎమ్మెల్యేలు సింహాద్రి రమేశ్ వంటి వారు ఎక్కడ మట్టి కనిపిస్తే అక్కడ దోపిడీకి తెరదీశారు. ఇసుకను కొల్లగొట్టారు. రూ.కోట్లు ఆర్జించారు. ఇది సరిపోదన్నట్లు ప్రజల ఆస్తులను కబ్జా చేయడానికీ వెనుదీయలేదు. కొడాలి నాని మరో అడుగు ముందుకు వేసి పేకాట క్లబ్బులు, కేసినోలతో ప్రజలను దోచుకున్నారు. ఆయన ఆగడాలు తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మచిలీపట్నంలో పేర్ని నాని, ఆయన తనయుడు కిట్టు చేసిన ఆగడాలు అన్నీఇన్నీ కావు. తమకు అడ్డుచెప్పిన వారికి కేసులు పెట్టి వేధించుకుతిన్నారు. విజయవాడ నగరంలో వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు వంటి వారు చేసిన ఆగడాలతో విసుగెత్తిన ప్రజలు ఓటుతో వారికి బుద్ధి చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు జిల్లాల్లో అధికార పార్టీ అభ్యర్థులు తుడుచుపెట్టుకోవడం ఒక ఎత్తు అయితే ప్రత్యర్థులకు రికార్డు స్థాయి మెజారిటీలు రావడం మరో ఎత్తు. ప్రజల్లో గూడుకట్టుకున్న కసి ఓట్ల సునామీ రూపంలో పోటెత్తడంతో అధికార పార్టీ ఆనవాళ్లు లేకుండా పోయింది.

60 శాతం ఓటర్లు కూటమి వైపే

ఎన్టీఆర్ జిల్లాలో పోస్టల్ బ్యాలెట్లతో కలిపి 13,69,985 ఓట్లు పోలవ్వగా కూటమి అభ్యర్థులకు 7,93,281 ఓట్లు పోలయ్యాయి. అంటే 57.90 శాతం ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపారు. కృష్ణా జిల్లాలో 13,15,074 ఓట్లు పోలవ్వగా కూటమి అభ్యర్థులకు 7,94,531 ఓట్లు పోలయ్యాయి. అంటే 60.41 శాతం ఓటర్లు కూటమికే జై కొట్టారు.

ఉండేదెవరో..? మారేదెవరో..?



ఏకపక్షంగా వచ్చిన ఎన్నికల ఫలితాలు అధికారులు సైతం కంగుతిన్నారు. ఈనెల 9న నూతన ప్రభుత్వం కొలువుదీరనుండటంతో స్థానచలనం తప్పదని అధికారులు ఆలోచనలో పడ్డారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలో అన్ని విభాగాల్లో అధికారుల మార్పులు, చేర్పులు ఉంటాయనే చర్చ నడుస్తోంది. గత ఐదేళ్లుగా వైసీపీ నాయకుల ఒత్తిడికి లొంగి టీడీపీ, జనసేన నాయకులపై తప్పుడు కేసులు బనాయించి ఇక్కట్లపాలు చేసిన పోలీస్ అధికారులపైనా ఈ ప్రభావం పడుతుందనే వాదన వినపడుతోంది.

వైసీపీకి అనుకూలంగా పనిచేసిన అధికారులకు స్థానచలనం ఖాయం

- బదిలీల కోసం ఇప్పటి నుంచే అధికారుల ప్రయత్నం
- త్వరలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ విభాగంలో భారీ మార్పులుండే అవకాశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గెలిచిన టీడీపీ, జనసేన అభ్యర్థులను ఆయా పార్టీల నేతలు మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. వివిధ విభాగాల అధికారుల పనితీరుపై తమదైన శైలిలో వివరిస్తున్నారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన రాజాబాబు ఎన్నికల సమయంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఆయనను కేంద్ర ఎన్నికల కమిషన్ ఉన్నపళంగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుత కలెక్టర్ డీకే బాలాజీ వచ్చారు. పరిపాలన సౌలభ్యం కోసం నూతన ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో భాగంగా జిల్లాస్థాయి అధికారుల బదిలీలు పెద్దఎత్తున ఉంటాయని జిల్లాస్థాయి అధికారుల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యేలు, వారి అనుచరుల సూచనల మేరకు అడ్డగోలు పనులు చేసిన అధికారులను జిల్లా నుంచి సాగనంపుతారనే ప్రచారం మొదలైంది. ఫలానా అధికారిని జిల్లా నుంచి బయటకు పంపాలని ఎమ్మెల్యేలను కలుసుకున్న సమయంలో టీడీపీ, జనసేన నాయకులు చెప్పకనే చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాస్థాయి అధికారుల పనితీరు, వ్యవహారశైలిని వివరిస్తూ ప్రజలకు మేలు జరగాలంటే మనకు అనుకూలంగా ఉండే అధికారులను తీసుకురావాలని సిఫార్సులు కూడా చేస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకుల సూచనలు విన్న ఎమ్మెల్యేలు కొంతకాలం ఓపికపడితే అన్నీ సర్దుకుంటాయని వేచి ఉండాలని చెబుతున్నారు. కౌంటింగ్ జరిగే సమయంలో కృష్ణా యూనిర్సిటీ వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు కూటమి ప్రభుత్వం వచ్చింది కాబట్టి, ఏ ప్రాంతానికి వెళతావని చర్చించుకోవడం కనిపించింది. రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర విభాగాల్లో కొద్ది రోజుల్లో పెద్దఎత్తున అధికారులు బదిలీలు ఉంటాయని అధికారులు చెప్పుకుంటున్నారు. జిల్లాస్థాయిలో డీఆర్‌డీఏ పీడీ, జిల్లా పరిషత్ సీఈవో, హౌసింగ్ పీడీ పోస్టుల్లో ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. దీంతోపాటు సాంఘిక సంక్షేమశాఖ, బీసీ సంక్షేమశాఖల అధికారులు మారిపోతారని కలెక్టరేట్ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

యూనివర్సిటీ అధికారులపై ఫిర్యాదులు

కృష్ణా యూనివర్సిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పరిపాలనా వ్యవహారాల్లో తమ చిత్తానుసారంగా వ్యవహరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరి అక్రమాలకు కళ్లెం వేసేందుకు కొందరు ప్రొఫెసర్లు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్నికలకు ముందే 70 మందికిపైగా అధ్యాపకులు, సిబ్బంది కొల్లును కలిసి అక్రమాలను వివరించారు.

తహసీల్దార్, ఎంపీడీవో పోస్టుల కోసం పోటాపోటీ

ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే జిల్లాలోని 25 మండలాల తహసీల్దార్, ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఈ నెలాఖరు నాటికి ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు మళ్లీ జిల్లాకు రానున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు గెలవడంతో తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తుల ద్వారా మండలస్థాయి అధికారులు తాము కోరుకున్న మండలాల్లో పోస్టింగ్ వేయించుకునేందుకు ఇప్పటి నుంచే తెరవెనుక మంతనాలు జరుపుతున్నారు. టీడీపీ, జనసేన నాయకులను కలుసుకుని కోరుకున్న మండలాలకు వచ్చేందుకు తమవంతుగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. ఉయ్యూరు, మచిలీపట్నం, గుడివాడ డివిజన్‌లలోని కీలక మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవోల పోస్టులను పొందేందుకు అధికారులు పోటీ పడుతున్నారు. గుడివాడ డివిజన్ పరిధిలోని బాపులపాడు మండలం తహసీల్దార్ పోస్టులో ఎవ్వరినీ నియమించకుండా అక్కడి ఆర్డీవో, గన్నవరం ఎమ్మెల్యే రెండేళ్లుగా తెరవెనుక చక్రం తిప్పారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎవరైనా తహసీల్దార్‌గా వచ్చినా వారితో బలవంతంగా సెలవు పెట్టించారు. పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాల పరిధిలోని ఇసుక అక్రమాలకు పాల్పడ్డారు. ఇందుకుగాను రోజువారీగా రెవెన్యూ అధికారులు లక్షల్లో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎవరు గెలిచినా.. మీదే గెలుపు

'ఆంధ్రజ్యోతి' వినూత్న కార్యక్రమానికి అనూహ్య స్పందన

- 6లో..



కూపన్లు డ్రా తీస్తున్న బ్రాంచ్ మేనేజర్ వేమూరి మురళి

గురితప్పిన గులకరాయి

పనిచేయని కోడికత్తి 2.0 డ్రామా

- సెంట్రల్‌లో చిత్తయిన వైసీపీ ఎత్తులు
- టీడీపీ కార్యకర్తలే టార్గెట్‌గా వేధింపులు
- అయినా రికార్డు బద్దలు కొట్టిన టీడీపీ
- ఉమ్మడి కృష్ణాలో టాప్ మెజార్టీ

వైసీపీ గులకరాయి గురి తప్పింది. కోడికత్తి 2.0గా ఓట్లు కురిపిస్తుందనుకున్న డ్రామా కాస్తా రివర్స్ అయ్యింది. డ్రామా జరిగిన విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే టీడీపీ అభ్యర్థి బొండా ఉమా 61,148 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ కేసులో మొదట వడ్డెర కాలనీలోని అన్యం పుణ్యం తెలియని వారిని కేసులో ఇరికించారన్న విమర్శలు వచ్చాయి. తర్వాత ఓ టీడీపీ నాయకుని అదుపులోకి తీసుకొని అక్కడి టీడీపీ అభ్యర్థి బొండా ఉమను అరెస్టు చేయాలని హడావిడి చేశారు. ఎట్టకేలకు టీడీపీ నేతలను వదిలి సతీష్ అనే యువకుని అరెస్టుచేసి నెల్లూరు జైలుకు పంపారు. నెల్లూరు జైలులో సుమారు నెల రోజులకుపైగా రిమాండ్‌లో ఉన్న సతీష్ బెయిల్‌పై విడుదలైన మరుసటిరోజు జరిగిన ఓట్ల లెక్కింపులో గులకరాయి ఎలా గురితప్పిందో ఓటర్లు విస్పష్టమైన తీర్పునిచ్చారు.





మధురానగర్ : ఎన్నికల్లో సానుభూతి కోసం వైసీపీ నేతలు ఆడిన డ్రామాల్లో ఒకటి గులకరాయి. సీఎం జగన్ నిర్వహించిన మేమంతా సిద్ధం యాత్రలో ఒక యువకుడు విసిరాడని చెబుతున్న గులకరాయి ముందుగా సీఎం జగన్‌కు తగిలింది. ఆ తర్వాత సెంట్రల్ వైసీపీ అభ్యర్థి వెల్లంపల్లికి తగిలి కింద పడిపోయింది. ఈ ఒక్క డ్రామాతో ఎన్నికల్లో గట్టెక్కేయవచ్చని వైసీపీ నేతలు భావించారు. టీడీపీ కార్యకర్తలను టార్గెట్ చేసుకుని వ్యవహారాన్ని నడిపించారు. అయినా ఈ డ్రామాలు ఎన్నికల్లో పనిచేయలేదు. వైసీపీ నేతలు ఆడిన ఆటలు టీడీపీకి సెంట్రల్ నియోజకవర్గంలో భారీ మెజారిటీని తీసుకొచ్చాయి. ఫలితాలు వెలువడుతున్నప్పుడు రాష్ట్రంలో అందరి దృష్టి సెంట్రల్ నియోజకవర్గంపైనే ఉంది. అసలు ఇక్కడ ఏ పార్టీ గెలుస్తుందోనని ఆసక్తిగా ఎదురుచూశారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో సెంట్రల్ నియోజకవర్గంలో రికార్డుస్థాయి మెజారిటీని టీడీపీ సాధించింది. 2014లో మల్లాది విష్ణు చేతిలో అతి స్వల్ప తేడాతో ఓటమి చెందినా బొండా ఉమా ఎక్కడా నిరుత్సాహపడకుండా నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌కు ధైర్యం నూరిపోస్తూ పనిచేశాడు. ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీ అధికార ప్రతినిధిగా నిత్యం జగన్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై తన గొంతుక వినిపించారు. బొండా దెబ్బకు మల్లాది విష్ణు తట్టుకోలేడనే కారణంతో జగన్ పక్క నియోజకవర్గం నుంచి వెలంపల్లిని దింపారు. చివరకు సీఎంపై గులకరాయి దాడితో రాష్ట్రంలో సెంట్రల్ నియోజకవర్గం, బొండా ప్రజల దృష్టిలో పడ్డారు. ఈ కేసులో తనను ఇరికించాలని చూసినా బొండా ధీటుగా ఎదుర్కొని పోరాడారు. తన హయాంలో జరిగిన అభివృద్ధిని చూపిస్తూ, వైసీపీ కుట్రలను నిలదీశాడు. ఎన్నికల్లో ఆయన దూకుడే నియోజకవర్గంలో ప్రతి రౌండ్‌లోనూ వైసీపీ అభ్యర్థి కంటే భారీగా మెజార్టీ రావడానికి కారణమైంది. మొత్తం 17 రౌండ్లలోని ప్రతి రౌండ్‌లో టీడీపీ అధిక్యత సాధించింది. ఈవీఎంల ద్వారా 1,28,376 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్‌లో 1658 ఓట్లతో కలిపి మొత్తం 1,30,034 (63.52 శాతం) ఓట్లతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. ఈవీఎంల ద్వారా 60,274 ఓట్లు, పోస్టల బ్యాలెట్‌ల ద్వారా 874 కలిపి మొత్తం 61,148 (29.87 శాతం) ఓట్లతో వెలంపల్లి శ్రీనివాస్ పోటీకి దరిదాపుల్లో లేకుండా పోయారు. 69,257 మెజార్టీతో బొండా ఉమా కొత్త రికార్డు నెలకొల్పారు.



గెలుపు రథసారథులు...
రావి, వెనిగండ్ల

గుడివాడ : పదేళ్లుగా గుడివాడలో టీడీపీ జెండాను రెపరెపలాడించాలని చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. అధినేతల ఆదేశం, నేతల పట్టుదల, కార్యకర్తల్లో కసి కలిసొచ్చాయి. టీడీపీలో కొడాలి నానీని ఓడించి తీరుతామని భీష్మ ప్రతిజ్ఞ చేసిన రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల రాము తమ మాట నిలబెట్టుకున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, యువనేత లోకేష్‌ల పిలుపు మేరకు వీరిరువురు నాలుగుసార్లు గెలిచి తనకు నియోజకవర్గంలో ఎదురులేదనుకొన్న కొడాలి నానీని ఘోరంగా ఓడించారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు తొలిసారి తన సొంత నియోజక వర్గమైన గుడివాడ (అప్పట్లో నిమ్మకూరు గుడివాడలో అంతర్భాగం) నుంచి పోటీ చేసి గెలుపొందారు. తర్వాత గుడివాడ నుంచి ఆయన వారసులుగా రావి వెంకటేశ్వరరావు తండ్రి రావి శోభనాద్రి చౌదరి, ఆ తర్వాత రావి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. తర్వాత జూనియర్ ఎన్టీఆర్ సిఫార్సుతో రావి వెంకటేశ్వరరావును కాదని కొడాలి నాని టీడీపీ బీ ఫాం పొందగలిగారు. రెండుసార్లు టీడీపీ తరఫున గెలిచిన కొడాలి నాని తన స్వార్థం కోసం వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో మంత్రి అయ్యాక వైసీపీ పెద్దలను సంతోషపెట్టేందుకు ఏకంగా చంద్రబాబు, లోకేష్‌లతోపాటు టీడీపీ అధినేత సతీమణి భువనేశ్వరిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దాంతో టీం టీడీపీ అంతా కొడాలి ఓటమిపైనే దృష్టిపెట్టింది. రాష్ట్రంలో ఎక్కడ గెలిచినా, గెలవక పోయినా గుడివాడలో గెలిచి తీరాలని కార్యకర్తలను టార్గెట్‌గా పెట్టారు. ఆ టార్గెట్‌ను 50 వేలకుపైగా మెజార్టీ సాధించిన రావి, వెనిగండ్లను అభినవ కృష్ణార్జునులుగా కార్యకర్తలు వర్ణిస్తున్నారు.



చంద్రబాబు, నారా లోకేశ్‌లకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కేశినేని చిన్ని, బొండా ఉమా

చంద్రబాబు ఇంటికి నేతల క్యూ..

▸ అధినేతను కలిసిన కేశినేని చిన్ని, గద్దె తదితరులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేసిన కూటమి అభ్యర్థులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. టీడీపీ నుంచి గెలుపొందిన విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, టీడీపీ ఎమ్మెల్యేలుగా గెలుపొందిన బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావు, కొల్లు రవీంద్ర, కాగిత కృష్ణ ప్రసాద్, బోడె ప్రసాద్, తదితరులు బుధవారం పార్టీ అధినేత చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మెజారిటీల పరంగా రికార్డులను తిరగరాసిన నాయకులను చంద్రబాబు అభినందించారు.

వన్‌టౌన్ : ఏపీ సీఎంగా ఎన్నికైన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని ఆయన నివాసంలో బుధవారం 2.82లక్షల భారీ మెజారిటీతో విజయవాడ ఎంపీగా విజయం సాధించిన కేశినేని శివనాథ్(చిన్ని) కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచిన బొండా ఉమామహేశ్వరరావు చంద్రబాబుకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబునాయుడు వారికి అభినందనలు తెలిపారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను శివనాథ్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కేశినేని శివనాథ్, బొండా ఉమామహేశ్వరరావు, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి రామ్‌లు కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన రవీంద్ర, బచ్చుల బోసుబాబు



మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నుంచి భారీ మెజారిటీతో గెలుపొందిన మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబును ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్న చంద్రబాబుకు కొల్లు రవీంద్ర, గొర్రెపాటి గోపీచంద్, బచ్చుల బోసుబాబు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పెడన రూరల్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ తదితరులు ఉండవల్లిలో కలిసి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ అర్జా నగేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ వంశీ, రామన్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు యార్లగడ్డ శుభాకాంక్షలు



హనుమాన్‌జంక్షన్, జూన్ 5 : గన్నవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా 37,628 ఓట్ల ఆధిక్యతతో ఘన విజయం సాధించిన యార్లగడ్డ వెంకట్రావుకు నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం పెద్ద సంఖ్యలో యార్లగడ్డకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను యార్లగడ్డ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రజా ప్రతినిధులు



వన్‌టౌన్, జూన్ 5 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. ఎన్నికలలో జనసేన తరపున పోటీ చేసి అనకాపల్లి ఎంపీగా గెలిచిన కొణతాల రామకృష్ణ, జనసేన తరపున పోటీచేసి పాలకొండ ఎమ్మెల్యేగా గెలిచిన నిమ్మకజయకృష్ణ, టీడీపీ తరపున పోటీచేసి దెందులూరు ఎమ్మెల్యేగా పోటీచేసిన చింతమనేని ప్రభాకర్ తదితరులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకుల ఆశీస్సులను అందుకుని ప్రసాదాలు స్వీకరించారు.



అభిమానులు, పార్టీశ్రేణులతో వర్ల కుమార్‌రాజా

సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూస్తా..

▸ వర్ల కుమార్‌రాజా

పామర్రు, మే 5 : పేద వర్గాల సంక్షేమానికి చంద్రన్న ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్‌లతో పాటు ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని పామర్రు ఎమ్మెల్యేగా ఎంపికైన వర్లకుమార్‌రాజా హామీ ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వరకుమార్ రాజాను కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. జగన్ పాలనలో ప్రజలు పడ్డ కష్టాలు తీరిపోతాయని చెప్పారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, జక్కశ్రీనివాసరావు, మండ పాకశంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంబరాలు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావటం.. పామర్రు నియోజకవర్గంలో వర్లకుమార్‌రాజా అత్యధిక మెజార్టీ సాధించినందుకు గ్రామాల్లో పార్టీ శ్రేణులు టాపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. భారీ ర్యాలీతో కూమార్‌రాజా పామర్రుకు బుధవారం వేకువజామున 3గంటలకు చేరుకున్నారు. తొలుత ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరుకు చేరుకున్న కూమార్‌రాజా పార్టీ నేతలు ఏర్పాటు చేసిన విజయోత్సవ కేక్‌ను పంచిపెట్టారు. అనంతరం దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సిద్ధం

▸ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి

వన్‌టౌన్, జూన్ 5 : ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ఎన్నికలలో కూటమి విజయం రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనమని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడులు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబునాయుడుకు, కూటమి ప్రజా ప్రతినిధులకు ఎన్జీవో సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వానికి అనుగుణంగా బాధ్యతలను నిర్వహిస్తారని చెప్పారు, ప్రభుత్వంతో ఉద్యోగులు స్నేహసంబంధాలను పెంపొందిస్తామని తెలిపారు. ప్రభుత్వం మారాలని పెద్ద ఎత్తున ఉద్యోగులు ఓటు వేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు నూతనోత్సాహంతో ఉద్యోగులు అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు ఇబ్బందులను ఎదుర్కొన్నారని, ఒత్తిడికి గురయ్యారని చెప్పారు. బకాయిల చెల్లింపుల్లో చూపిన నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు ఓటు హక్కుద్వారా గుణపాఠం చెప్పారన్నారు. కూటమి గెలుపు ఒకరకంగా ఉద్యోగుల విజయమని వ్యాఖ్యానించారు.

ఎవరు గెలిచినా.. మీదే గెలుపు విజేతల ఎంపిక

▸ 'ఆంధ్రజ్యోతి' వినూత్న కార్యక్రమానికి అనూహ్య స్పందన

విజయవాడ, జూన్ 5 : అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన వివిధ పార్టీల అభ్యర్థుల్లో విజేత ఎవరు..? అంటూ ఓటరునాడిని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన వినూత్న కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అంటూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వారానికి రెండు కూపన్లను అందించింది. ఇందులో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వేలాదిగా పాఠకులు కూపన్లు పూర్తి చేసి పంపారు. విజయవాడ కార్యాలయానికి చేరిన కూపన్ల నుంచి బుధవారం డ్రా తీసి విజేతలను ఎంపిక చేయడం జరిగింది. మంగళవారం వచ్చిన ఫలితాలకు దగ్గరగా ఉన్నవారిని ఎంపిక చేసి.. జిల్లాలో ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతి ముగ్గురికి రూ.5వేల చొప్పున నగదు అందజేయనున్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ వేమూరి మురళీ, ఏజీఎం వాసు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్ రామకృష్ణలు డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు.

ప్రథమ విజేత : వారణాసి కామేశ్వరి, 20/342/32/1, వెంకమ్మతోట, చిలకలపూడి, బందరు, కృష్ణా జిల్లా

ద్వితీయ విజేతలు : నెక్కంటి ప్రభాకర్‌రావు, 9-81సీ లోయతోట, నున్న, ఎన్టీఆర్ జిల్లా, వింత కామేశ్వరి, యాదవుల బజారు, తేలప్రోలు, ఉంగుటూరు (మండలం), కృష్ణా జిల్లా, ఎన్.వి.ఎన్.ఎస్.రామ్‌కుమార్, 1-25 1వ రోడ్డు, గరికపర్రు, తోటవల్లూరు మండలం, కృష్ణా జిల్లా

ప్రజలు తిరగబడి తరిమి కొట్టారు

▸ మచిలీపట్నానికి పరిశ్రమలు తెస్తాం

▸ పోర్టును అభివృద్ధి చేస్తాం : రవీంద్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 5 : ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనకు విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు ఈ ఎన్నికల్లో తిరుగుబాటు చేసి కూటమి అభ్యర్థులకు అత్యధిక మెజారిటీతో ఘనవిజయాన్ని ఇచ్చారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీలతో కలిసి కొల్లు రవీంద్ర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయనని, మచిలీపట్నం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. మచిలీపట్నంలో పోర్టు ఆధారిత పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. మంగినపూడి బీచ్‌ను గోవా టూరిజం స్పాట్ చేస్తామన్నారు. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ యూనిట్‌ను మచిలీపట్నంలో నెలకొల్పుతామన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్, తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేస్తామన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ, కొల్లు రవీంద్రకు చంద్రబాబు కేబినెట్‌లో స్థానం దక్కుతుందని, మచిలీపట్నంను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అవకాశాలు లభిస్తాయన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, అభ్యర్థుల విజయానికి చిత్తశుద్ధితో అందరూ సమన్వయంతో పనిచేశారన్నారు. జనసేన నాయకులు మాదివాడ రాము, గడ్డం రాజు, మోటమర్రి బాబా ప్రసాద్, మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దేరపల్లి అనిత, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, లంకే శేషగిరి, గోపు సత్యనారాయణ, గోకుల శివ, కరెడ్ల సుశీల, కుంచే నాని, వాలిశెట్టి తిరుమలరావు, లంకే హరికృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఓట్లు 'కూటమి'కే ఆధిక్యం

మచిలీపట్నం, జూన్ 5 : ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓట్లను కూటమి అభ్యర్థులకే వేశారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గంలోనూ కూటమి అభ్యర్థులకే ఓట్లు వేసి వైసీపీ ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను చాటారు. పోస్టల్‌బ్యాలెట్లకు సంబంధించి పామర్రులో టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజాకు 1336 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌కు 780 ఓట్లు వచ్చాయి. 15 ఓట్లు చెల్లుబాటుకానివిగా నిర్ధారించారు. అవనిగడ్డలో 3,824 పోస్టల్ బ్యాలెట్‌లు ఉండగా, జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కు 2501 ఓట్లు, వైసీపీ అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబుకు 884 ఓట్లు వచ్చాయి. 20 తిరస్కరించారు. నోటాకు 19 ఓట్లు వచ్చాయి. పెనమలూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 3,258 ఉండగా, టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్‌కు 2155, వైసీపీ అభ్యర్థి జోగి రమేష్‌కు 1035 ఓట్లు వచ్చాయి. నోటాకు 24 ఓట్లు వచ్చాయి. గుడివాడలో పోస్టల్ బ్యాలెట్‌లు 3026 ఉండగా, టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాముకు 2005, వైసీపీ అభ్యర్థి కొడాలి నానికి 965 ఓట్లు వచ్చాయి. నోటాకు 18 ఓట్లు వచ్చాయి. మచిలీపట్నంలో పోస్టల్ బ్యాలెట్‌లు 3981ఉండగా, టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్రకు 2584 ఓట్లు, వైసీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తికి 1042ఓట్లు వచ్చాయి. 249ఓట్లను తిరస్కరించారు. 31ఓట్లు నోటాకు పడ్డాయి. పెడన నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 1673 ఉండగా, టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు 1010ఓట్లు, వైసీపీ అభ్యర్థి ఉప్పాల రాముకు 507ఓట్లు వచ్చాయి. 121 ఓట్లను తిరస్కరించగా, 8 ఓట్లు నోటాకు పడ్డాయి. గన్నవరంలో నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 2463 ఉండగా, టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు 1459 ఓట్లు, వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీకి 862 ఓట్లు వచ్చాయి. 246 తిరస్కరించారు. 18 నోటాకు పడ్డాయి. మచిలీపట్నం పార్లమెంటులో పోస్టల్ బ్యాలెట్‌లు19,829ఓట్లు ఉండగా జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరికి 12,290, వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరావుకు 6,049ఓట్లు వచ్చాయి.

వరప్రసాద్‌కు డాక్టరేట్

▸ మూడేళ్లపాటు జగన్ ప్రభుత్వం వేధింపులు



అమరావతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వం మూడేళ్లపాటు వేధించి పలు ఇబ్బందులకు గురిచేసిన ఆర్థిక శాఖ ఉద్యోగి వరప్రసాద్ డాక్టరేట్ సాధించారు. సచివాలయంలోని ఆర్థిక శాఖలో ఎస్‌వోగా పనిచేస్తున్నారు. 2014-19లో చంద్రబాబు హయాంలో సీఎంవోలో ఈయన కీలకంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆర్థిక శాఖకు తిరిగి వచ్చారు. అయితే, జగన్ సర్కారు అక్రమంగా, పరిమితికి మించి చేస్తున్న అలవికాని అప్పులపై మీడియాలో ప్రతిరోజు కథనాలు వచ్చాయి. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలన్నీ బయటపడుతున్నాయన్న ఆక్రోశంతో ఆ రహస్య సమాచారమంతా గతంలో టీడీపీ ప్రభుత్వానికి దగ్గరగా పనిచేసిన వరప్రసాద్, మరో ఇద్దరు ఉద్యోగుల పనేనంటూ తీర్మానించి ఆ ముగ్గురిని సస్పెండ్ చేస్తున్నట్టు 2021 ఆగస్టు 4వ తేదీన జీవోలిచ్చారు. దాదాపు మూడేళ్ల తరువాత 2024 మార్చి 16వ తేదీన ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజున సస్పెన్షన్ ఎత్తేశారు. ఈ మూడేళ్ల కాలంలో కనీసం వారిమీద మోపిన సమాచార లీకేజీ ఆరోపణలపై స్పందించేందుకు వారికి నోటీసులు కూడా ఇవ్వలేదు. ఈ మూడేళ్ల సమయాన్ని వృథా చేయకుండా వరప్రసాద్ ఎస్వీయూ నుంచి ఆర్థిక శాస్త్ర విభాగంలో డాక్టరేట్ సాధించారు. ఆయన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.దేవరాజులు పర్యవేక్షణలో ఫైనాన్సింగ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాక్టీస్ ప్రాబ్లమ్స్ అండ్ ఇన్నోవేటివ్ స్ట్రాటజీస్ అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు.

పోలీసుల అత్యుత్సాహం..

▸ రామానాయుడు పేటలో రోడ్డుపై ఇనుపకంచెలు.. ▸ పేర్ని నాని ఇంటి వద్ద ఆంక్షలు

మచిలీపట్నం టౌన్, జూన్ 5 : రామానాయుడుపేటలో పోలీసులు ఇనుప కంచెలు వేసి ఎవరినీ నడవకుండా ఆంక్షలు విధించారు. రామానాయుడుపేట సెంటర్ నుంచి బచ్చుపేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు ప్రజలు ఎవరూ తిరగకుండా పోలీసులు బ్యారికేడ్లు, ఇనుప కంచెలు వేశారు. పేర్ని నాని ఇల్లు ఈ రోడ్డులో ఉన్నందున పోలీసులు ఈ విధమైన చర్యలు చేపట్టారు. దీనిపై డీఎస్పీ, సీఐల వద్దకు రామానాయుడుపేట ప్రజలు వెళ్లి బ్యారికేడ్లు తొలగించాలని కోరారు. రామానాయుడుపేటలో అప్రకటిత కర్ఫ్యూపై ప్రజలు అభ్యంతరం తెలిపారు.



రామానాయుడుపేటలో ఇనుప కంచెలు వేసిన పోలీసులు

గుడివాడ ప్రజలకు రుణపడి ఉంటా

▸ టీడీపీ కూటమి విజేత వెనిగండ్ల రాము



గుడివాడ, జూన్ 5 : గుడివాడ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానం కల్పించి, అభిమానంతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే విజేత వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో వెనిగండ్లకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. అధికారులు, పట్టణ ప్రముఖులు వెనిగండ్లకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాము మాట్లాడుతూ, గుడివాడ ప్రజలు అభిమానంతో అత్యధిక మెజార్టీనిచ్చి తనను గెలిపించారని, అభిమానిస్తే నెత్తిన పెట్టుకుంటారని, అసహ్యించుకుంటే ఎలా తొక్కేస్తారో ఈ ఫలితాలతో రుజువు చేశారన్నారు. జవాబుదారీ పాలనను ప్రజలకు అందిస్తానన్నారు. ఆరు నెలల పర్యటనలో ప్రతి ఇంటి కష్టాన్ని తెలుసుకున్నానని, ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లలో 25ఏళ్ల అభివృద్ధిని చేసి చూపిస్తానన్నారు. ఫలితాలు చూసి అమెరికా వెళ్లిపోతానని పిచ్చి కూతలు కూసిన కొడాలి నాని కౌంటింగ్ రోజున 10.30కే వెళ్లిపోయాడని ఎద్దేవా చేశారు. గుడివాడ ప్రజలు రికార్డు మెజార్టీతో గెలిపించి భువనేశ్వరమ్మకు బహుమతిగా ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాని ఓటమితో గుడివాడకు పట్టిన శని వదిలింది : రావి

రెండు దశాబ్దాలుగా గుడివాడను పట్టి పీడిస్తున్న కొడాలి నాని శని వదిలిపోయిందని, వెనిగండ్ల విజయంతో గుడివాడ అభివృద్ధి పథాన దూసుకుపోతుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం భారీ మెజార్టీతో గెలిచిన వెనిగండ్ల రామును అభినందించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి ఓటరుకు పేరు పేరున ధన్యావాదాలు తెలిపారు.

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా.. కీర్తి శిఖరాన మండలి

▸ బుద్ధప్రసాద్‌కు విశ్రాంత కలెక్టర్ లక్ష్మీకాంతం అభినందన



అవనిగడ్డ, జూన్ 5 : అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎన్నికైన తొలి వ్యక్తిగా కూటమి జనసేన అభ్యర్థి బుద్ధప్రసాద్ రికార్డు సృష్టించారు. అంతకుముందు దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 1972, 1978, 1983 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించగా, ఆ తర్వాత దివంగత మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు 1985, 1989, 1994 సంవత్సరాల్లో వరుసగా హ్యాట్రిక్ సాధించారు. 1994 ఎన్నికల్లో బుద్ధప్రసాద్ తొలి ప్రయత్నంలో ఓటమి చెందగా, 1999, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009 ఎన్నికల్లో ఓటమి చెంది రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. తిరిగి 2014 ఎన్నికల్లో విజయం సాధించి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో ఓటమి చెంది.. 2024లో జనసేన కూటమి అభ్యర్థిగా రికార్డు స్థాయిలో 46,434 ఓట్ల ఆధిక్యతను సాధించటమే కాక, అవనిగడ్డ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలివ్యక్తిగా రికార్డు సాధించారు. దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా నాలుగుసార్లు నియోజకవర్గం నుంచి చట్టసభలకు ఎన్నికయ్యారు.

బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు

అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు విశ్రాంత కలెక్టర్ బి.లక్ష్మీకాంతం శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం బుద్ధప్రసాద్ నివాసానికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన లక్ష్మీకాంతం బుద్ధప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తాను కృష్ణాజిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో నియోజకవర్గంలో బుద్ధప్రసాద్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. బుద్ధప్రసాద్ గెలుపు నియోజకవర్గానికి శుభపరిణామమని లక్ష్మీకాంతం అన్నారు.

ఆరు మండలాల్లోనూ మెజార్టీ

కూటమి జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌కు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో స్పష్టమైన మెజార్టీ లభించింది. ఘంటసాలలో 4941ఓట్లు, చల్లపల్లిలో 7117 ఓట్లు, మోపిదేవిలో 7920 ఓట్లు, అవనిగడ్డలో అత్యధికంగా 11,315 ఓట్లు, కోడూరులో 7652 ఓట్లు, నాగాయలంకలో 7852.. పోస్టల్ బ్యాలెట్ కలిపి 46434 ఓట్ల మెజార్టీ సాధించారు.



రైల్వే అధికారులు, విద్యార్థుల అవగాహన ర్యాలీ

రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఘనంగా పర్యావరణ దినోత్సవం



రైల్వేస్టేషన్, జూన్ 5 : విజయవాడ రైల్వే డివిజన్‌లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు జరిగాయి. రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సభీకులు, విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్ఎం, ఏడీఆర్ఎంలు పి.ఎ డ్విన్, కొండా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, స్కౌట్స్, గైడ్స్ పాఠశాల విద్యార్థులతో క్లాక్ టవర్ నుంచి స్టేషన్ పరిసర ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఇంధన సంరక్షణలో డివిజన్ సాధించిన విజయాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వల్ల కలిగే కాలుష్యం, ప్రమాదాల గురించి ప్రయాణికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు డీఆర్ఎం బహుమతులు అందజేశారు. డివిజన్‌లోని అన్ని ప్రధాన స్టేషన్లలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ పోస్టులో అభినందనలు

▸ తపాలా శాఖ వినూత్న కార్యక్రమం

లబ్బీపేట, జూన్ 5 : 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విజయం సాధించిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు హృదయపూర్వక అభినందనలు అదేవిధంగా వారి పదవీకాలానికి శుభాకాంక్షలు తెలియపరచవచ్చని, ఇందుకు కేవలం 10రూపాయలు రుసుము మాత్రమే చెల్లించి తమ దగ్గరలో ఉన్న ఏదైనా పోస్టాఫీసులో ఈ-పోస్ట్ ద్వారా అభినందనలు తెలపవచ్చని పేర్కొన్నారు. ఈ విధంగా పంపిన సందేశాలు నేరుగా మీ అభిమాన నాయకుని చేతికే చేరుతాయని తెలిపారు. ఈ-పోస్ట్ ద్వారా ప్రజలు 1,55,00 కంటే ఎక్కువ పోస్ట్ ఆఫీసుల నెట్‌వర్క్ ద్వారా ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిషన్, ఫిజికల్ డెలివరీ కలయికతో భారతదేశంలోని ఏచిరునామాకైనా తమ సందేశాలను పంపవచ్చని తెలిపారు. ఈ-పోస్ట్ ఇంటర్నెట్ ద్వారా సందేశాలను సాఫ్ట్ కాపీగా పంపుతుందని, గమ్యస్థానంలో అది హార్డ్ కాపీ రూపంలో చిరునామాదారునికి డెలివరీ చేయబడుతుందని, కేవలం రూ.10లకు ఏ4 పరిమాణం గల పేజీని ఈ-పోస్ట్ ద్వారా పంపవచ్చని తెలిపారు. ఈ సేవ గురించి మరింత సమాచారం కోసం దగ్గరలోని పోస్ట్ ఆఫీసుని సంప్రదించాలని తెలిపారు.



నీట్‌లో శారద విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం, జూన్ 5 : నీట్-2024 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన సీనియర్ బైపీసీ విద్యార్థులను బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మొగల్రాజపురం శారద విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, యు.నాగపవన్ (656), వి.తోరణ్ కార్తీక్ (632), పి.ఇందురెడ్డి (621), పి.రమ్యనాగసాయి(606), ఆర్.సింధుసిరి (602) తదితరులు మంచి ర్యాంకులు సాధించారని చెప్పారు. 150 మంది పరీక్ష రాయగా 75 మంది సీటు సాధించే మార్కులు సాధించారని చెప్పారు. తల్లిదండ్రుల కోరిక మేరకు అనుకున్న కళాశాలలో సీటు వచ్చే విధంగా విద్యార్థులు మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కళాశాలల అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీవీ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేశినేని నానీ.. ఇకనైనా మారు!

▸ బుద్దా వెంకన్న ట్వీట్

వన్‌టౌన్, జూన్ 5 : కేశినేని శ్రీనివాస్ (నాని) ఇకనైనా మారు.. అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న బుధవారం ట్వీట్ చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు నాని తన స్వార్థం చూసుకున్నాడని, అదే సమయంలో పార్టీకి అండగా శివనాథ్(చిన్ని) నిలిచాడని పేర్కొన్నారు. స్వార్థం ఓడిందని, సాయం గెలిచిందని, ఇకనైనా మారు అంటూ నానికి సూచించారు.

గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మోపిదేవి : కృష్ణా జిల్లా మోపిదేవి, మచిలీపట్నంలో బీసీ బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాలల కన్వీనర్ కె.వీర రవి తెలిపారు. బుధవారం ఆయన మోపిదేవి గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ, బీసీ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం 6, 7, 8 తరగతుల్లో వివిధ కేటగిరిల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈనెల 5వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 20న నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు.

ఢిల్లీకి అధినేత చంద్రబాబు..

గన్నవరం : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు గన్నవరం విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. బుధవారం ఢిల్లీ వెళ్లేందుకు ఉండవల్లి నుంచి రోడ్డు మార్గాన విమానాశ్రయానికి చేరుకోగా.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, కాగిత కృష్ణ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు, జాస్తి వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది కేవీ రమణ, జూపల్లి సురేష్ తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు. ప్రత్యేక విమానంలో చంద్రబాబు ఢిల్లీ వెళ్లారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ

మచిలీపట్నం టౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్లాస్టిక్ నిర్మూలన చేస్తామని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డీఈవో తాహెరా సుల్తానా ఆధ్వర్యంలో డీవైఈవోలు బి.సి.ఎస్. సింగ్, పద్మారాణి, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్, జూన్ 5 : అభయాంజనేయస్వామిని బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. కూటమి దెందులూరు అభ్యర్థిగా విజయం సాధించిన చింతమనేని ప్రభాకర్ బుధవారం స్థానిక అభయాంజనేయస్వామిని సతీసమేతంగా దర్శనం చేసుకొని పూజలు నిర్వహించారు. ఉండవల్లిలో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిసి తిరుగు ప్రయాణంలో అభయాంజనేయస్వామి ఆలయాన్ని, ఏపూరు దాసాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. కూటమి నిడదవోలు అభ్యర్థిగా విజయం సాధించిన కందుల దుర్గేశ్ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలో మర్యాద పూర్వకంగా కలిసి తిరుగు ప్రయాణంలో అభయాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. జనసేన పార్టీ నాయకులు స్వాగతం పలికారు.

టీడీపీ మహిళాశక్తి ప్రపంచానికే స్ఫూర్తి



రేమల్లెలో టీడీపీ నేత కలపాల జగన్మోహనరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 5 : కుంటుంబ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ అన్ని రంగాల్లో దీటుగా నిలుస్తున్న టీడీపీ మహిళాశక్తి కూటమి గెలుపులో కూడా కీలకపాత్ర పోషించి ప్రపంచానికే స్ఫూర్తిగా నిలచారని కలపాల విమలకుమారి అన్నారు. రేమల్లెలో టీడీపీ ఘన విజయాన్ని పుస్కరించుకుని మండల టీడీపీ నేత కలపాల జగన్మోహనరావు విగ్రహానికి బుధవారం నివాళులర్పించారు. కొల్లూరి శోభారాణి, అవిర్నేని సామ్రాజ్యం, హాసిని, లత పాల్గొన్నారు.

వెల్లువెత్తిన ప్రజాభిమానం

పెనమలూరు, జూన్ 5 : కూటమి పెనమలూరు అభ్యర్థిగా జిల్లాలో అత్యధిక మెజారిటీతో ఎన్నికైన బోడె ప్రసాద్‌కు నియోజకవర్గ ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే అభిమానులు బోడెకు శుభాకాంక్షలు తెలపడానికి పోటెత్తారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు వివిధ శాఖల ఉద్యోగులు బోడె ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమం సాయంత్రం వరకు కొనసాగింది.



బోడె ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైవీబీ

అభినందనలు తెలిపిన వైవీబీ

కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన బోడె ప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ టీడీపీ నాయకులు వైవీబీ రాజేంద్రప్రసాద్ బుధవారం అభినదించారు. బోడెను దుశ్శాలువతో సత్కరించారు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు ఇరువురూ కృతజ్ఞతలు తెలిపారు.

బోడెకు ఐలా ప్రతినిధుల సత్కారం

అఖండ విజయాన్ని నమోదు చేసిన టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్‌ను ఆటోనగర్ ఐలా ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. అత్యంత మెజారిటీ సాధించిన బోడెను సత్కరించారు. ఐలా ప్రతినిధుల బృందంలో ఛైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం, నార్ల పణి కుమార్, బిల్లుపాటి జితేంద్రప్రసాద్, డైకిన్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

బోడె, సారథికి శుభాకాంక్షలు

ఉయ్యూరు : సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరు టీడీపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించిన బోడె ప్రసాద్, నూజివీడు టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన కొలుసు పార్థసారథిలకు ఉయ్యూరు మండల పార్టీ నాయకులు, పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ముదునూరు పీఏసీఎస్ మాజీ ఛైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ, వీరవల్లిమొఖాసా పీఏసీఎస్ మాజీఛైర్‌పర్సన్ జొన్నలగడ్డ నరేశ్‌బాబు, ముదునూరు మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు బుధవారం విజయవాడలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.







బోడె ప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న అంగన్వాడీలు, ఐలా ప్రతినిధులు.. సారథికి అభినందనలు తెలుపుతున్న ఉయ్యూరు మండల నాయకులు



యార్లగడ్డ వెంకట్రావును అభినందిస్తున్న చలసాని ఆంజనేయులు

యార్లగడ్డకే అత్యధిక ప్రజామోదం

కృష్ణామిల్క్‌యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్ రూరల్, జూన్ 5 : గన్నవరం నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిచిన నాయకుడు యార్లగడ్డ వెంకట్రావు అని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. విజయవాడలోని యార్లగడ్డ నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. బాపులపాడు మండలం నుంచి పలువురు నాయకులు కలిసి అభినందించారు. యజ్జవరపు రంగారావు, కాటూరి విజయభాస్కర్, టీడీపీ నేతలు వేగిరెడ్డి పాపారావు, గొట్టాపు ప్రవీణ్, బేతాళ ప్రమీలారాణి , ఆయిల్‌పామ్ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బా వీర రాఘవరావు, గుండపనేని ఉమావరప్రసాద్ తదితరులు ఉన్నారు.

హనుమాన్‌జంక్షన్: యార్లగడ్డ వెంకట్రావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, పార్టీ నాయకులు పుట్టా సురేష్, మాదల శ్రీనివాసరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, కాటూరి విజయ్ భాస్కర్, యజ్జవరపు రంగారావు, ఆర్నేపల్లి సూరిబాబు, ఆలూరి సురేష్, కలపాల సూర్యనారాయణ, యనమదల శ్రీనివాసరావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, కలపాల కుమార్, చిన్నందేవి, కర్రా ప్రసాద్ ఉన్నారు.



వెంకట్రావును అభినందిస్తున్న సాయికల్యాణి



వెంకట్రావుకు పూలబొకే అందజేస్తున్న న్యాయవాది కెవి రమణ

గన్నవరం : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అత్యధిక మెజార్టీతో గెలుపొందటంపై ఆ పార్టీ శ్రేణులు పూలబొకేలు, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, ప్రముఖ న్యాయవాది కెవి రమణ, జాస్తి వెంకటేశ్వరరావు, కెహెచ్ కోటేశ్వరరావు, నల్లమోతు రమేష్, నిడమర్తి బుజ్జారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు



కాటూరులో..

ఎనికేపాడు(గన్నవరం), జూన్ 5 : పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మధుశ్రీ అన్నారు. ఎనికేపాడు విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డేను బుధవారం నిర్వహించారు. విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుశ్రీ మాట్లాడుతూ, అంతరించి పోతున్న వృక్షజాతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. భవిష్యత్‌తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కలు నాటాలన్నారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము, బి.వినోద్ కుమార్ మాట్లాడుతూ, సైకిల్ వినియోగం ద్వారా వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలి

కాటూరు(ఉయ్యూరు) : ప్రతిఒక్కరూ మొక్కలునాటి సంరక్షించడం బాధ్యతగా గుర్తెరిగి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గుడివాడ డీవైఈవో పద్మారాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం కాటూరు జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగంతో పాటు చెట్లను విచక్షణారహితంగా నరికి వేయడంవల్ల పర్యావరణానికి కలిగే అనర్థాలు తెలియజేసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల తల్లిదండ్రులు, సమాజా నికి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జాకీర్ అహ్మద్, పాఠశాల హెచ్‌ఎం తలశిల రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కేసీపీ కర్మాగారంలో పర్యావరణ దినోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు.

కూటమి విజయానికి బీసీల కృషి మరువలేనిది..

పెనమలూరు, జూన్ 5 : కృష్ణాజిల్లాలో ఏడు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీలతో గెలిపించినందుకు జిల్లా ప్రజలకు, టీడీపీ శ్రేణులకు జిల్లా గౌడ సాధికారిక కన్వీనర్ శొంఠి శివరాంప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం యనమలకుదురులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలోని బీసీలు కూటమి గెలుపునకు కష్టపడి పనిచేసినందుకు ధన్యావాదాలు తెలిపారు. టీడీపీకి బీసీలు వెన్నెముకగా మరో సారి చరిత్రలో నిలిచిపోయారన్నారు.

వైసీపీకి ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని రాజీనామా

గండిగుంట(ఉయ్యూరు), జూన్ 5 : వైసీపీ పంచాయతీరాజ్ విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి, ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు(డాన్) పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టుతెలిపారు. తనతోపాటు గండిగుంట ఎంపీటీసీ-2 బందెల శ్రీనివాస్ కూడా పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

విరామ బైబిల్ పాఠశాల విజేతకు బహుమతులు

ఉయ్యూరు, జూన్ 5 : హెబ్రోను సంఘంలో మూడురోజులపాటు జరిగిన విరామ బైబిల్ పాఠశాల తరగతులు బుధవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి పిల్లలు, పెద్దలు పెద్దసంఖ్యలో హాజరై బైబిల్ శిక్షణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు జాన్‌డేవిడ్, డాక్టర్ జ్యోతి బహుమతులు అందజేశారు.



దాసాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్, జూన్ 5 : నూజివీడు రోడ్డులోని ఏపూరు దాసాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి 74వ జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని ఆలయ శాశ్వత ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

వెనిగండ్ల రాము గెలుపు చరిత్రాత్మకం

గుడివాడ: కొడాలి నానిపై వెనిగండ్ల రాము భారీ మెజార్టీతో గెలవడం చరిత్రాత్మకమని, రాము ఆధ్వర్యంలో గుడివాడ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని టీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దారం నర సింహారావు అన్నారు. బుధవారం శ్రీనివాస సెంటర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకారుల సంఘాల ఆధ్వర్యంలో కూటమి విజయదుందుభి మోగించినందుకు కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి కేవీ దుర్గాచారి, మాజీ అధ్యక్షుడు యలమర్తి కోటేశ్వరరావు, మందరాపు మోహన బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కూటమి సంబరాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 5 : ఎన్నికల ఫలితాల్లో టీడీపీ, జనసేన కూటమికి తమ ఓటు హక్కుతో పట్టం కట్టడంతో ప్రజలతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బాపులపాడు మండలంలోని గ్రామాల్లో బుధవారం టీడీపీ జనసేన కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహించారు. కొత్తపల్లిలో వల్లూరిపల్లి నాని ఆధ్వర్యంలో రైతులు ఎన్టీఆర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేసి నివాళులర్పించారు. తిప్పనగుంటలో అధ్యక్షుడు సాయిల నాగేశ్వరరావుతో కలిసి మాదాల శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రాజేష్, మొవ్వా పండు, రాంబాబు, ముదునూరి అభిలాష్, మురళి, తదితరులు కేక్‌కట్ చేసి ప్రజలతో కలిసి సంబరాలు నిర్వహించారు. గ్రామ కూడలిలోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రజా ప్రభుత్వం వచ్చిందంటూ నినదించారు. కానుమోలులో పొట్లూరి ప్రసాద్, చింతల అప్పారావు, దన్నే దుర్గారావు, చెడుగొండి శివశంకర్ తదితరుల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచారు. కాకులపాడులో చలసాని శ్రీనివాస్, పెరికీడులో గొట్టాపు ప్రవీణ్, బేతాళ ప్రమీ లారాణి, మడిచర్లలో పుట్టా సురేష్, మాటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ ఘన విజయాన్ని పురస్కరించుకుని సంబరాలు నిర్వహించారు.



తిప్పనగుంటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

పుస్తకపఠనంతో మానసిక వికాసం



ఉంగుటూరులో మ్యూజికల్ ఛైర్స్ ఆడుతున్న విద్యార్థులు

ఉంగుటూరు, జూన్ 5 : పుస్తకపఠనంతో విద్యార్థులకు భాషా పరిజ్ఞానం, విశ్లేషణాత్మక సామర్థ్యం మెరుగుపడటంతోపాటు మానసిక వికాసం వృద్ధి చెందుతుందని నిత్యం పుస్తకాలు చదవడం వల్ల భాషపై పట్టు, భావాలను వ్యక్తీకరించే నేర్పు, సంభాషణా చాతుర్యం మరింతగా పెంపొందుతాయని ఉంగుటూరు, మానికొండ, తేలప్రోలు, ఆత్కూరు గ్రంథాలయాధికారులు యు.చంద్రశేఖరరావు, ఎల్.హరికృష్ణ, బి.శ్రీని వాసరావు, టీవీ కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయా గ్రంథాలయాల్లో పుస్తక పఠనం, కథలు చదివించడం, ఉత్తరాలు రాయడం, వార్తాపత్రికలు చదవడం, మ్యూజికల్ ఛైర్స్, క్యారమ్స్, చదరంగం వంటి పోటీలు నిర్వహించారు.

గన్నవరం : విద్యార్థులు పుస్తక పఠనంపై మరింత ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జ్యోతికుమారి అన్నారు. ముస్తాబాద గ్రేడ్-3 గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి నీతి కథలను చదివించారు. ఈ సందర్భంగా జ్యోతికుమారి మాట్లాడుతూ, విద్యార్థులు ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. శేషగిరిరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మానసిక వికాసానికి, పుస్తక పఠనంపై ఆసక్తిని పెం పొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని గ్రంథాలయాధికారి పి. స్వర్ణల తాదేవి అన్నారు. వీరవల్లి గ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిబిరం నిర్వహణలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్ లాంటి ఆటల్లో పోటీలు నిర్వహించారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి: లంక

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 5 : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయ రంగానికి అండగా ఉంటూ ఆర్థికాభివృద్ధికి చేదోడుగా ఉండే సహకార సంఘ అభివృద్ధికి కృషిచేస్తానని వీరవల్లి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ అన్నారు. వీరవల్లిలో సహకార సంఘ ఉద్యోగులు బుధవారం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద్ పాల్గొన్నారు.



బెనర్జీని సత్కరిస్తున్న సహకార సంఘ ఉద్యోగులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.50

పృథ్వీశ్వరస్వామికి బుద్ధప్రసాద్ పూజలు



చల్లపల్లి, జూన్ 5: నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలు పొందిన మండలి బుద్ధప్రసాద్ బుధవారం దర్శించుకు న్నారు. బుద్ధప్రసాద్‌కు దేవదాయశాఖ ఈవో వై.శ్రీనివాసు ఆధ్వర్యంలో వేదపండితులు స్వాగతం పలికారు. అలయ మర్యాదలతో సత్కరించారు. బుద్ధప్రసాద్ కుమారుడు మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్వినీ కుమార్, దేవస్థానం అభివృద్ధికర్త మండవ రవీంద్ర, ఎంపీటీసీ సభ్యుడు రాజులపాటి అంకమ్మ, నాదెళ్ల శివరామకృష్ణ, పరుచూరి సురేష్, నాదెళ్ల వెంకటనరసయ్య, నాదెళ్ల ప్రభాకరరావు, కైతేపల్లి శ్రీనివాసరావు, దేవభక్తుని గోపాలకృష్ణ, రాజులపాటి జగదీష్, సుబ్బారావు పాల్గొన్నారు.



నారా లోకేశ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న బూరగడ్డ వేదవ్యాస్, కిషన్‌తేజ

మచిలీపట్నం టౌన్, జూన్ 5: మంగళగిరి నియోజకవర్గంలో 90 వేలకు పైగా మెజారిటీతో విజ యం సాధించిన నారా లోకేశ్‌ను బుధవారం మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, ఆయన కుమా రుడు కిషన్‌తేజ మంగళగిరిలో కలిసి అభినందనలు తెలిపారు.

జనసేన గెలుపు ప్రజావిజయం

• ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు

అవనిగడ్డ రూరల్: జనసేన పోటీచేసిన 21 స్థానాల్లో గెలవటం అభినందనీయమని, ఈ విజయం ప్రజా విజయమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణు గోపాలరావు తెలిపారు. పవన్ కల్యాణ్ సమ సమాజ స్థాపన కోసం పని చేస్తున్నారని, ప్రజలు మంచి విజ యాన్ని అందించారని అన్నారు. ఎంపీగా వల్లభనేని బాలశౌరిని అత్యధిక ఓట్ల మెజా ర్టీతో గెలిపించినందుకు ప్రజలందరికీ కృతజ్ఞ తలు తెలిపారు.



టీడీపీ, జనసేన శ్రేణుల

విజయోత్సవాలు

అవనిగడ్డలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు, అరిసేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు



గుడివాడలో కేక్ కట్ చేస్తున్న విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల నాయకులు



గుడివాడ జనసేన కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బూరగడ్డ శ్రీకాంత్

అవనిగడ్డ, జూన్ 5: ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి భారీ విజయం పొందడంపై అవనిగడ్డ మండలంలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు సంబరాలు జరిపారు. పార్టీ అవనిగడ్డ మండల కార్యాలయంలో యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అవని గడ్డ ప్రసన్నాంజనేయస్వామి దేవాయలంలో 116 కొబ్బరి కాయలు కొట్టారు. లంకమ్మ ఆలయంలోనూ బడే సుబ్బా రావు నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ వంతెన సెంటర్‌లో టీడీపీ, జనసేన నేతలు కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు.

బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షల వెల్లువ

నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన మండలి బుద్ధప్రసా ద్‌ను పలువురు ముఖ్య నేతలు మంగళ, బుధవారాల్లో కలసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, బండే నాగవెంకట కనకదుర్గ, యలవర్తి చిన్నా, బచ్చు రఘునాథ్, పులిగడ్డ నాంచారయ్య, బండే శ్రీనివాసరావు, మండవ బాలవర్ధిరావు, తలశిల వెంకట నరసింహారావు, స్వర్ణలత, మెండు లక్ష్మణరావు, ఉప్పల ప్రసాద్, మెడ బలిమి మల్లికార్జునరావు, రావి నాగేశ్వరరావు, నడకుదుటి జనార్దనరావు, రావి రత్నగిరి, చందన రంగారావు, పోలి మేట్ల ఏసుబాబు, మోర్ల రాంబాబు, పైడిపాముల కృష్ణకు మారి, యార్లగడ్డ శ్రీనివాసరావు, నిడమానూరి దిలీప్ కుమార్, ముమ్మనేని నాని, తుమ్మల చౌదరిబాబు, పరు చూరి సుభాష్ చంద్రబోస్, గుత్తికొండ వరప్రసాద్, తాడి కొండ వెంకటేశ్వరరావు, జనసేన నేతలు రాయపూడి వేణుగోపాలరావు, మత్తి వెంకటేశ్వరరావు, బాసు నాంచా రయ్యనాయుడు, గుడివాక శేషుబాబు, మర్రే గంగయ్య, పూషడపు రత్నగోపాల్, బండ్రెడ్డి హరి, పద్యాల వెంకట ప్రసాద్, బండ్రెడ్డి మల్లికార్జునరావు, కోన రాజశేఖర్‌లు బుద్ధప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం

అవనిగడ్డ: కూటమి అధికారంలోకి వచ్చి, మండలి బుద్ధప్రసాద్ భారీ మెజారిటీతో గెలుపొందిన సంద ర్భంగా ప్రధాన సెంటర్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫ్లెక్సీ ఫొటోలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.

అరిసేపల్లిలో..

మచిలీపట్నం టౌన్: కూటమి భారీ మెజారిటీతో గెలవడంతో బందరు మండలం అరిసేపల్లి పంచాయతీ చిట్టిపాలెం గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు అమ్మిరెడ్డి శివ య్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నరేంద్ర మోదీ, కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరి చిత్రపటా లకు పాలాభిషేకం చేశారు. గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణప్రసాద్, కుంచే నాని, తలారి సోమశేఖర్, లంకే శేషగిరిరావు, సత్యనారాయణ, పాండురంగారావు, ఉపేంద్ర పాల్గొన్నారు.

లింగవరంలో..

గుడివాడ రూరల్: వెనిగండ్ల రాము అత్యధిక మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా లింగవరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకు న్నారు. బాణాసంచా కాల్చారు. చిరంజీవి రెడ్డి, గోపాల స్వామి, శ్రీనివాసరెడ్డి, కాటూరి ఏసుపాదం పాల్గొన్నారు.

వెనిగండ్ల రాము గెలుపు చరిత్రాత్మకం

గుడివాడ: కొడాలి నానిపై వెనిగండ్ల రాము భారీ మెజారిటీతో గెలవడం చరిత్రాత్మకమని, రాము ఆధ్వ ర్యంలో గుడివాడ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుం దని బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దారం నర సింహారావు అన్నారు. బుధవారం శ్రీనివాస సెంటర్‌లో విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో కూటమి విజయదుందుభి మోగించినందుకు కేక్‌ను కట్ చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి కేవీ దుర్గాచారి, మాజీ అధ్యక్షుడు యలమర్తి కోటేశ్వరరావు, స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి మందరావు మోహనబ్రహ్మాజీ, విశ్వబ్రాహ్మణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జి.రాజా, నాయకులు పిచ్చేశ్వరరావు, జె.ఎస్.ఆర్. నాని, అమర్‌బాబు పాల్గొన్నారు. ఆంజనేయ పేటలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో మచిలీపట్నం ఎంపీగా వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము భారీ విజయం సాధించిన సందర్భంగా జనసేన నాయకులు, వీర మహిళల ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొని కేక్ కట్ చేశారు. జనసేన నాయకులు, కార్యకర్తలకు శ్రీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, శాయన రాజేష్, కోసూరి అంజి, పెద్ది కిషోర్‌పాల్గొన్నారు.

కూటమి విజయం ఓ రికార్డు: కొనకళ్ల



కొనకళ్లను మర్యాదపూర్వకంగా కలిసిన కాగిత కృష్ణప్రసాద్

మచిలీపట్నం టౌన్, జూన్ 5: రాష్ట్ర చరిత్రలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 164 సీట్లలో అఖండ విజయం సాధించడం ఒక రికార్డు అని టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొన కళ్ల నారాయణరావు అన్నారు. ఆయనను బుధ వారం పెడన ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్ కలిశారు. కాగితను ఆయన అభినం దించారు. మచిలీపట్నం, గుడి వాడ, అవనిగడ్డ, పెనమలూరు, పామర్రు, గన్నవ రం నుంచి గెలు పొందిన ఎమ్మెల్యేలకు కొనకళ్ల అభినందనలు తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా: కాగిత కృష్ణప్రసాద్



కాగిత కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న బూరగడ్డ కిషన్‌తేజ

బంటుమిల్లి, జూన్ 5: పెడన నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుం డా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం తన నివాసంలో విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు, మోదీ, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సమన్వయంతో పనిచేస్తానని, తన తండ్రి కాగిత వెంకట్రావు బాటలో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పెడన ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్‌ను బూరగడ్డ వేద వ్యాస్ తనయుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బూరగడ్డ కిషన్‌తేజ్ ఘనంగా సన్మానిం చారు. జనసేన నాయకుడు సుజ్ఞానం సతీష్, డీసీ మాజీ ఛైర్మన్ గౌరిశెట్టి వెంక టేశ్వరరావు, జడ్పీటీసీ అర్జా నగేష్, ప్రసాద్ అభినందనలు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



• కేశినేని చిన్నిని కలిసిన వెనిగండ్ల రాము

విద్యాధరపురం, జూన్ 5: విజయవాడ ఎంపీగా విజయం సాధించిన కేశినేని శివనాథ్ (చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవా రం గుడివాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెనిగండ్ల రాము మర్యాదపూర్వకంగా కలిశారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కొల్లు రవీంద్రకు అభినందనల వెల్లువ



కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న లుక్కా సాయిరామ్

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం ఎమ్మెల్యేగా గెలుపొందిన కొల్లు రవీంద్రను బుధవారం పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనంగా సత్కరిం చారు. టీడీపీ మచిలీపట్నం నియోజకవర్గ పరిశీలకుడు లుక్కా సాయిరామ్‌ప్రసాద్, న్యాయవాది ఎర్నేని వేదవ్యాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్ (నాగ బాబు), తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్య నారాయణ, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, బీజేపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సోడి శెట్టి బాలాజీ, మాజీ డిప్యూటీ స్పీకర్ బూర గడ్డ వేదవ్యాస్ కలసి అభినంద నలు తెలిపారు. ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్ సత్కరించారు.

ప్రజలు చరిత్రాత్మక తీర్పిచ్చారు: బండి రామకృష్ణ



మండలి బుద్ధప్రసాద్‌ను అభినందిస్తున బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జూన్ 5: కూటమికి అఖండ విజయం చేకూర్చి ప్రజలు చరిత్రాత్మక తీర్పిచ్చారని జన సేన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ అన్నారు. బుధవా రం పార్టీ కార్యాలయంలో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలను గెలుపొంది జనసేన రాష్ట్రంలో చరిత్ర సృష్టించిందన్నారు. కేంద్ర రాజకీయాల్లో పవన్‌కల్యాణ్, చంద్ర బాబు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

బుద్ధప్రసాద్, నాదెండ్ల మనోహర్‌కు అభినందన

అవనిగడ్డ, తెనాలి ఎమ్మెల్యేలుగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్, నాదెండ్ల మనోహర్‌ను బండి రామకృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బండి విజయ్, గడ్డం రాజు, పినిశెట్టి వేణు, బండి కరుణాకర్, విష్ణు, యశ్వంత్, మైకేల్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టులో మొక్కలు నాటుతున్న న్యాయాధికారి భాస్కరరావు

మచిలీపట్నం టౌన్, జూన్ 5: పర్యావరణ పరి రక్షణ అందరి బాధ్యత అని బెల్ రిటైర్డు అడిషనల్ జన రల్ మేనేజర్ డీకేఆర్కే రవిప్రసాద్ అన్నారు. మైత్రి ఫౌం డేషన్ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కేఎన్‌హెచ్ బాలుర హాస్టల్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ షరీఫ్, సుజాత పాల్గొన్నారు. మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మంలో 200 మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిర క్షించాలంటూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హైనీ సంస్థల అధ్యక్షుడు లింగం మోజె స్, నోబుల్ సంస్థల కోశాధికారి మణిలాల్, మైత్రి ఫౌండేషన్ గౌరవ అధ్య క్షుడు ఏఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టులో..

బంటుమిల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎం.భాస్కరరావు ప్రారంభించారు. లాయర్లు యాళ్ల శ్యామ్‌బాబు, పళ్లెం వెంకటేశ్వరరావు, ఇల్లూరి రాయుడు, అలేఖ్య, సూపరింటెండెంట్ అంజనీ భాయ్, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కూటమి విజయం సాధించడంతో మచిలీపట్నంలో స్వీట్లు పంచుకుంటున్న న్యాయవాదులు

భూ హక్కు చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 5: కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రజలకు నష్టం చేకూర్చే భూ హక్కు చట్టాన్ని రద్దు చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలని సీనియర్ న్యాయవాది డి.పోతురాజు కోరారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో కూటమి విజయంపై న్యాయవాదుల సంఘ భవనం వద్ద న్యాయవాదులు, గుమాస్తాలు హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంచుకున్నారు. న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు తుంగల హరిబాబు, న్యాయవాదులు మాదివాడ వెంకట నరసింహారావు, పరసా మధుసూదన రావు, లంకే వెంకటేశ్వరరావు, తిరుమాని సత్యనారాయణ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, ఎండీ మస్తాన్, యార్లగడ్డ కి రణ్, బృందావనం శ్యామ్‌కుమార్,గోవర్ధనమ్మ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

కూచిపూడి, జూన్ 5: మాజీ మంత్రి దేవినేని వెం కటరమణ వర్ధంతి కార్యక్రమాన్ని మొవ్వలో బుధవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. చిన్నారులకు పుస్తకా లు, పెన్నులు పంచారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్న పనేని వీరేంద్ర, పోతార్లంక రాము, మండవ రత్నగిరిరావు, మండవ కోటేశ్వరరావు, ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ గెలిచిందని నా గడ్డివాములు తగులబెట్టారు

• చినతుమ్మిడి సర్పంచ్ చలం ఆరోపణ

బంటుమిల్లి, జూన్ 4: టీడీపీకి గ్రామంలో ఆధిక్య త రావడంతో తన 30 ఎకరాల వరిగడ్డి వాములకు మం గళవారం రాత్రి ఎవరో నిప్పంటించారని చిన తుమ్మిడి సర్పంచ్ ఓగ్గె చలం ఆరోపించారు. కూటమి విజయం సాధించాక గ్రామంలోని తన ఇంటి వద్ద టీడీపీ నాయ కులు, కార్యకర్తలతో స్వీట్లు పంచుకుని కేకులు కట్ చేసు కుంటున్న సమయంలో తన పాతిక ఎకరాల వరిగడ్డి వామికి మంటలు అంటుకోవడంతో అగ్నిమాపక సిబ్బం ది వచ్చి అదుపు చేశారన్నారు. రాత్రి మరలా మరో నాలుగు గడ్డి వాముల్లో ఉన్న ఐదెకరాల గడ్డివాముకు ఎవరో కక్షతో నిప్పు అంటించారని తెలిపారు. ఆ సమ యంలో చేపలు పట్టుబడికి వెళుతున్న వారు చూసి కేక లేశారని, దీంతో గ్రామస్థులు మం టలను అదుపులోకి తెచ్చారని అన్నారు. దాదాపు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందన్నారు.

మోపిదేవి మండలంలో బుద్ధప్రసాద్‌కు 7,900 మెజారిటీ

మోపిదేవి, జూన్ 5: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున అవనిగడ్డ ఎమ్మెల్యేగా గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు మోపిదేవి మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో కలిపి 7,900కు పైగా మెజారిటీ వచ్చింది. పెదప్రోలులో మండలికి 2,147, సింహాద్రి రమేశ్‌కు 1,175 మెజారిటీ 972, కొక్కిలిగడ్డలో మండలికి 636, సింహాద్రికి 409, మెజారిటీ 227, కె.కొత్త పాలెంలో మండలికి 1,637, సింహాద్రికి 873, మెజారిటీ 764, బొబ్బర్లంకలో మండలికి 353, సింహాద్రికి 186, మెజారిటీ 167, మోపిదేవి పంచాయతీ పరిధిలో మండలికి 2,872, సిం హాద్రికి 1,889, మెజారిటీ 983, వెంకటాపురంలో మండలికి 783, సింహాద్రికి 701, మెజారిటీ 82, మెరకనపల్లి పంచాయతీలో మండలికి 955, సింహాద్రికి 512 మెజారిటీ 443, నాగాయి తిప్పలో మండలికి 809, సింహాద్రికి 425 మెజారిటీ 404, మోపిదేవిలంకలో మండలికి 285, సింహాద్రికి 176, మెజారిటీ 109, కోసూరువారిపాలెంలో మండలికి 1202, సింహాద్రికి 449, మెజారిటీ 753, ఉత్తరచిరువోలులంకలో మండలికి 635, సింహాద్రికి 429, మెజార్టీ 206, మేళ్లమర్తిలంకలో మండలికి 284, సింహాద్రికి 131, మెజార్టీ 153 పెదకళ్లేపల్లిలో మండలికి 3,286, సింహాద్రికి 1,459 మెజారిటీ 1,827 వచ్చింది.

వెనిగండ్లకు గుడ్లవల్లేరు మండలంలో 10,070 ఓట్ల ఆధిక్యం

గుడ్లవల్లేరు: టీడీపీ గుడివాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెనిగండ్ల రాముకు మండలం లో 10,070 ఓట్ల మెజారిటీ వచ్చింది. గుడ్లవల్లేరులో 1,961 ఓట్ల మెజారిటీ, చంద్రాలలో 246, అంగలూరులో 716, కౌతవరంలో 1,592, వేమవరంలో 187, వడ్లమన్నాడులో 1,094, ఉల వలపూడిలో 101, గాదేపూడిలో 91, డోకిపర్రులో 758, చిత్రంలో 125, పెంజంద్రలో 189, పోలిమెట్లలో 125, కుచికాయలపూడిలో 114, శేరికల్వపూడిలో 32, వెణుతురుమిల్లిలో 374, పెసరమిల్లిలో 164, కూరాడలో 943, కట్టానిచెరువులో 235, పురిటిపాడులో 268, తాడిచర్లలో 233, చినగొన్నూరులో 172, విన్నకోటలో 588 ఓట్ల మెజారిటీని వెనిగండ్ల రాము సాధిం చారు. మామిడికోళ్లలో 66, శేరిదగ్గుమిల్లిలో 35 ఓట్ల మెజారిటీని కొడాలి నాని సాధించారు.

గూడూరు మండలంలో కాగిత మెజారిటీ 9,490 ఓట్లు

పెడన: గూడూరు మండలంలో పెడన నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన కాగిత కృష్ణప్రసాద్‌కు 9,490 ఓట్ల మెజారిటీ లభించిందని నాయకులు పోతన స్వామి, దాసరి ఉమాసాయిరాం, కోలపల్లి రజని తెలిపారు. మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణప్రసాద్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంపై గూడూరు మండల టీడీపీ నాయకులు గోపీ నాగబాబు, ఎన్‌ఏ బేగ్, కూనపరెడ్డి పెద్దిరాజులు, మునీశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

తోట్లవల్లూరు మండలంలో కుమార్‌రాజాకు 3,106 ఓట్ల ఆధిక్యం

తోట్లవల్లూరు: మండలంలో టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజాకు 3,106 ఓట్ల మెజార్టీని ప్రజలు ఇచ్చారు. తోట్లవల్లూరులో టీడీపీకి 3,093, వైసీపీకి 2,295, పాములలంకలో టీడీపీకి 415, వైసీపీకి 552, భద్రిరాజుపాలెంలో వైసీపీకి 1,218, టీడీపీకి 927, చాగంటిపాడులో వైసీ పీకి 805, టీడీపీకి 770, కళ్లంవారిపాలెంలో వైసీపీకి 393, టీడీపీకి 188, దేవరపల్లిలో టీడీ పీకి 994, వైసీపీకి 902, గుర్విందపల్లిలో టీడీపీకి 405, వైసీపీకి 273, ఐలూరులో టీడీపీకి 401, వైసీపీకి 273, కనిగిరిలంక, ముకలపల్లిలంక కంబైన్డ్ టీడీపీకి 487, వైసీపీకి 62, కుమ్మ మూరు, కనకవల్లిలో టీడీపీకి 822, వైసీపీకి 630, గరికపర్రులో టీడీపీకి 1,405, వైసీపీకి 911, పెనమకూరులో టీడీపీకి 994, వైసీపీకి 765, యాకమూరులో టీడీపీకి 1,057, వైసీపీకి 722, రొయ్యూరులో టీడీపీకి 818, వైసీపీకి 602, తోడేళ్లదిబ్బలంకలో టీడీపీకి 161, వైసీపీకి 161, చినపులిపాకలో టీడీపీకి 390, వైసీపీకి 362, బొడ్డపాడులో టీడీపీకి 687, వైసీపీకి 387, వల్లూరుపాలెంలో టీడీపీకి 1,501, వైసీపీకి 1,075 చొప్పున వచ్చాయి. భద్రిరాజుపాలెం, పాములలంక, కళ్లంవారిపాలెంలో మాత్రమే వైసీపీకి ఆధిక్యత వచ్చింది.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



జయపురం వద్ద కాలువలోకి దూసుకెళ్లిన కారు

కోడూరు, జూన్ 5: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారిపై బుధవారం అవనిగడ్డ నుంచి కోడూరు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పంట కాలువలోకి దూసుకెళ్లింది. జయపురం వద్ద ఇలాంటి ఘట నలు జరగటం ఇది మూడోసారి. ఈ ప్రమాదం లో కారులో ప్రయాణిస్తున్న వారికి ఏమీ కాలేదు. కోడూరు రహదారి నిర్మాణం మధ్యలోనే నిలిపి వేయటంతో రోడ్డుపై కంకర రాళ్లు లేచిపోయి ప్రమా దకరంగా మారటంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

వైసీపీ ఓటమితో పట్టాభి స్మారక భవనానికి అడ్డంకులు తొలగినట్టే: గోపు సత్యనారాయణ



పట్టాభి సీతారామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

మచిలీపట్నం టౌన్, జూన్ 5: వైసీపీ ఓటమి చెందడం ఎంపీగా బాలశౌరి, ఎమ్మెల్యేగా కొల్లు రవీంద్ర విజయం సాధించడంతో స్వాతంత్ర్య సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణా నికి అడ్డంకులు తొలగినట్టేనని, ఇక ఆయన ఆత్మ శాంతిస్తుందని తెలుగు రైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. యూనియన్ బ్యాంకు వద్ద పట్టాభి సీతారామయ్య విగ్రహానికి టీడీపీ నాయకుడు పీవీ ఫణి కుమార్, బీజేపీ నాయకుడు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ, జి.ఎస్.ఆర్.మూర్తితో కలిసి గోపు సత్యనా రాయణ పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. మచిలీపట్నం కార్పొరేషన్ నుంచి భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వకపోవడం వల్ల జాప్యం జరిగిందన్నారు. అనుమ తులు ఇవ్వకుండా పేర్ని నాని అడ్డుపడ్డారని, అభివృద్ధికి అడ్డుపడిన ఆయన కుటుంబ సభ్యులకు మచిలీపట్నం ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు.

చల్లపల్లికి మరో వీడ్కోలు వాహనం వితరణ

చల్లపల్లి, జూన్ 5: చల్లపల్లి గ్రామానికి మరో వీడ్కోలు వాహనం సమకూరింది. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలిచిన మన కోసం మనం ట్రస్ట్ నిర్వ హణలో ఈ వాహనం సేవలు అందించనుంది. హైదరాబాద్ సన్‌షైన్-కిమ్స్ హాస్పి టల్స్ అధినేత డాక్టర్ గురవారెడ్డి వితరణతో వాహనాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ తెలిపారు. తన తల్లిదండ్రులు రాజ్య లక్ష్మి- సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ.ఐదు లక్షలను డాక్టర్ గురవారెడ్డి విరాళంగా అందించగా ఆ విరాళంతో వాహనం సమకూర్చారు. గతంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్(రమేష్ హాస్పిటల్స్) వితరణతో ఒక వాహనం సమకూరింది.